


# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
### అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఇందిర పాపం లజ్జితురాలై** సంకోచిస్తోంది. "పదవే, ఇక్కడదాకా వచ్చాక సిగ్గుపడతావెందుకు?" అని ప్రక్క అమ్మాయి బలవంతంగా లోపలకు తీసుకొచ్చింది.

గదిలో రెండే కుర్చీలున్నాయి. వాటిమీద వాళ్ళని కూర్చోమని చెప్పి తాను మంచం మీద కూర్చున్నాడు. ఓ నిమిషం ఏం మాట్లాడాలో తోచక ముగ్గురూ మౌనంగా ఊరుకున్నారు. మధుబాబుకు ఇద్దరి ఆడ వాళ్ళ మధ్య తన స్థితి కొంచెం ఇబ్బందిగా వుంది.

"ఇల్లు ఎలా తెలిసింది?" అనడిగాడు ఏదో అనాలని.

"ఇంత మహా రచయిత చిరునామా తెలియకనే పోతుందా? మాఇంటిదగ్గర మీ హాస్పటల్ నర్స్ వుంది. ఆమెని ఎంక్వయిరీ చేశాము" అందా అమ్మాయి నవ్వి.

ఇందిర ముసిముసిగా నవ్వి మరింత తలవంచుకుని కూర్చుంది.

మధుబాబుకు సిగ్గువేసింది. ఓ క్షణం ఆగి "పాపం శ్రమపడి ఇంతదూరం యీ పూరిల్లు వెతుక్కుంటూ వచ్చారు. ఈ బీదవాడిమీద ఎంత దయ" అన్నాడు.

"ఇదిగో దయా.. అదంతా యీ నంగనాచిలా కూర్చుందే యీ దొరసానిది. ఇక్కడకు వచ్చేదాకా ప్రాణం తోడేసింది. ఇప్పుడేమీ తెలియనిదానిలా పోజువేసి కూర్చుంటుంది. కొత్తవారు కాబట్టి మీ ముందు ముంగిలా కూర్చుందిగాని, అమ్మా బయట దీని ప్రతాపం చూడాలి. మాట్లాడవే."

ఇందిర స్నేహితురాలిని మోచేతితో పొడిచి.

"ఊరుకోవే రత్నా నీకు పుణ్యముంటుంది" అంది మందలింపుగా అతి సన్నని స్వరముతో.

కాని ఈ మాటలు మధుబాబు చెవిని పడినై. "ఐతే ఘాటైన మీ పేరు రత్న అన్నమాట" అన్నాడు.

"రత్నకుమారి"

"ఇక్కడకాలేజీలో చదువుతున్నారా?" అని ప్రశ్నించాడు. మధుబాబు.

"అవునండీ. బి.ఏ మొదటి ఏడూ చదువుతున్నాం. ఇద్దరం క్లాస్‌మేట్స్ం" అంది రత్నకుమారి.

అతను ఇందిరవైపు అనాలోచితంగా చూశాడు. పదిహేడు, పద్దెనిమిదేళ్ళకంటే ఎక్కువ వుండవు. చామనఛాయగా వుంది. నిండుగా సుకుమారంగా, సహజ సుందరంగా వుంది. అతను తనవైపు చూడటం కనిపెట్టి తన పెద్ద పెద్ద కళ్ళని క్రిందకు వాల్చుకుని నేల చూపులు చూడసాగింది.

"అంత సిగ్గుపడేవారు ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అన్నాడు మధుబాబు.

"అలా అడగండి" అన్నది రత్నకుమారి.

నిజానికి ఇద్దరు ఆడపిల్లలు ఓ యువకుడ్ని కారణం ఏమైనాకాని, వెతుక్కుంటూ అతని ఇంటికి రావటం కొంచం సాహసంతో కూడిన పనే. మనసులో గాఢమైన సంచలనం వుంటేనేకాని సాధారణంగా ఇలా జరగదు.

రత్నకుమారి వాళ్ళది అసలు విశాఖపట్నమే. ఇందిర తండ్రి ఇంజినీరు. క్రితం ఏడాదే అక్కడకు ట్రాన్స్‌ఫరై వచ్చాడు. క్లాసుమేట్స్ అయినాక ఇద్దరకూ బాగా మైత్రి కలిసిపోయింది. ఈ విషయాలు చెప్పింది రత్నకుమారి.

"అబ్బ! ఉరికి దూరంగా, ఈ ఆశ్రమ వాతావరణంలో ఎలా వుంటున్నారండీ, విసుగ్గా వుండదూ, భయం వెయ్యదూ?" అంది.

మధుబాబు ఏదో జవాబు చెప్పబోతున్నాడు. ఇంతలో ఇందిర అనుకోకుండా కల్పించుకుని "నాకయితే ఇలాగే బాగుంటుంది. ఎంత ఏకాంతం – ఏమీ గొడవలు లేకుండా" అనేసింది. తరవాత నాలిక కొరుక్కుంది.

రత్నకుమారి కిలకిలమని నవ్వి మాట్లాడేసింది. "ఇందిరకి మీ పుస్తకాలు బాగా వంటబట్టినాయండీ. ఎప్పుడూ ఏకాంతం, పెసిమిజం, సెన్సిటివ్ నెస్ ఇవే గొడవలు. ఏ సరోవర తీరాల్లోనో, ప్రకృతి సీమల్లోనో వంటరిగా తిరుగుతూ గడపక ఈ చదువూ, సమస్యలూ ఇవన్నీ ఎందుకంటుంది. ఏమోనబ్బా నా కయితే యీ విపరీత ప్రకృతులు నచ్చవు. హాయిగా తినటం, చదువుకోవటం, సినిమాలు చూడటం, నిద్దరోవటం..."

"పెళ్ళి చేసుకోవటము.." అన్నాడు మధుబాబు అర్థోక్తిలో.

"పిల్లల్ని కనటం" అని పూర్తిచేసింది ఇందిర.

రత్నకుమారి కోపం వచ్చినట్లు ముఖంపెట్టి "అదిగో అప్పుడే రచయితగారూ, పాఠకురాలూ ఏకమైపోయారు. అలా ఐతే నేను వెళ్ళిపోతాను" అంటూ లేవబోయింది.

ఇందిర ఆమె చెయ్యిపట్టుకుని విడిచిపెట్టకుండా "పిల్లల్ని కనవద్దులే. వెళ్ళకు" అంది.

మధుబాబుకి నవ్వు వచ్చి పకపకమని నవ్వాడు. ఇందిర సిగ్గు పడింది.అతిధులకు ఏమైనా అల్పాహారం ఇవ్వాలని తోచి అతను బయటకు వెళ్ళి పనిమనిషి ఎక్కడైనా కనిపిస్తుందేమోనని చూశాడు. ఎక్కడా జాడలేదు. లోపలకు వచ్చి "ఇప్పుడే వస్తాన"ని చెప్పి లోపలగదిలోకి వెళ్ళాడు. ఫ్లాస్కులో పాలు వున్నాయి. రోజూ అతను స్టవ్ మీద కాఫీ స్వంతంగా కాచుకుని తాగుతున్నాడు. ఓ గిన్నెలో నీళ్ళుపోసి స్టవ్ మీద పెట్టాడు.

"ఏమిటండోయ్ లోపల గిన్నెలూ అవీ చప్పుడు చేస్తున్నారు. కాఫీ ప్రయత్నమా ఏమిటీ?" అంది బయటినుంచి రత్నకుమారి.

"మరి కాఫీ వేళయిందికదా" అని మధుబాబు సమాధానం చెప్పాడు.

"అది నిజమే. కాని మరి మాకోసం మీరిలా శ్రమపడటం అదోరకంగా ఉంటుందండీ మాకు"

"ఉండనివ్వండి పర్వాలేదు. ఏమీ లేకుండా ఊరుకుంటే నాకూ అదోరకంగా ఉంటుంది."

ఇందిర తనలో తాను నవ్వుకుంటూ గదంతా శ్రద్ధగా కలయజూసింది. గదైతే అందంగా వుందిగాని, అందులో ఉన్న సామాగ్రి మాత్రం నిర్లక్ష్యంగా, కలగాపులగంగా వదిలివేయబడి వుంది. గోడకు ఓ వైపు పెద్ద రేక్‌నిండా పుస్తకాలు ఉన్నాయి. ఇంగ్లీషువీ, తెలుగువీ, క్లాస్ పుస్తకాలూ అన్నీ కలగూరగంపలా ఉన్నాయి. ఆమె లేచి వెళ్ళి ఆ పుస్తకాల మీద ఒక్కొక్క దానిపేరు చూస్తూ తనకు తోచినట్లు ఓ క్రమంలో ఉంచసాగింది.

రత్నకుమారి ఆమె చేసే పనిని ఆసక్తితో చూస్తూ మౌనంగా ఊరుకుంది.

ఇంతలో మధుబాబు ఏదో వెతుక్కుంటూ గదిలోకి వచ్చాడు. ఇందిర కొంచెం జంకి ఇవతలకు జరిగింది.

అతను అన్వేషిస్తూన్న నేత్రాలతో అటూ ఇటూ చూడసాగాడు.

"ఏమిటది?" అంది రత్నకుమారి.

"స్పూన్" అన్నాడతను కొంచెం సిగ్గుపడుతూ.

మంచం పరుపు క్రిందా, దిండు క్రిందా చూశాడు. మళ్ళీ ఆ పుస్తకాలన్నీ కలగా పులగం చేశాడు. ఏమైంది? ఇందాక ఇక్కడే ఎక్కడో పెట్టాను అని గొణుక్కున్నాడు.

రత్నకుమారిని ఓసారి కుర్చీలోంచి లేవమని ఆ కుర్చీ అంతా వెదికాడు. మళ్ళీ ఓసారి పుస్తకాలు అటునుంచి ఇటూ ఇటునుంచి అటూ గజిబిజి చేశాడు.

"అదేమిటక్కడ తెల్లగా మెరుస్తోంది?" అంది రత్నకుమారి తలుపు మూల చూపిస్తూ.

"యస్. అక్కడవుంది" అంటూ తీసుకుని లోపలికి వెళ్ళాడు.

ఇందిర ఆ పుస్తకాలన్నీ మళ్ళీ చచ్చీ చెడి సర్దసాగింది. ఓ ఘడియపోయాక మధుబాబు ఇవతలకు వచ్చాడు, చూపులతో ఏదో వెదుకుతున్నాడు.

"ఏమిటండి?" అంది రత్నకుమారి.

"కాఫీ పౌడర్ డబ్బా" అంటూ  మళ్ళీ పుస్తకాల దగ్గరకు పోతున్నాడు.

ఇందిర ఉస్సురని నిట్టూర్చి దూరంగా జరిగి నిల్చుంది.

ఇంతలోనే అతనికి ఏదో స్ఫురించి "ఈ మంచం క్రిందవుండాలే" అంటూ దాని క్రిందకు ఒంగి లోపలకి ప్రాకి ఓ డబ్బాను బయటకు తీసుకొచ్చాడు. వాళ్ళ వంక ఓసారి  చూసి "కాఫీపొడి" అంటూ నవ్వి లోపలు వెళ్ళాడు.

స్నేహితురాళ్ళిద్దరూ ఒకరి మొహం వంక ఒకరు తెల్లబోయి చూసుకుని గప్‌చుప్‌గా ఊరుకున్నారు.

మళ్ళీ ఇందిర మిగిలిన పుస్తకాలు సర్దటంలో నిమగ్నురాలయింది.

పది నిమిషాల్లో కాఫీ తర్యారయింది. కప్పుల్లో పోసి ఇద్దరకూ తెచ్చి ఇచ్చాడు మధుబాబు. తనూ వో కప్పులో తెచ్చుకున్నాడు.

కాఫీ చాలా బాగా కుదిరింది. ఆడపిల్లలిద్దరూ కూడా అదేమాట అన్నారు.

ఇందిరకు ఇప్పుడు కాస్త ధైర్యం వచ్చింది. కాఫీ కప్పు క్రింద  పెడుతూ "ఇప్పుడు ఏమీ రాయటంలేదా?" అనడిగింది అతనివంక కాకుండా, ప్రక్కకి ఎటో చూస్తూ.

"ఏ గోడ ఏం సమాధానం చెబుతుంది? నన్నడిగితే చెబుతాను" అన్నాడు మధుబాబు పరిహాసంగా.

"పోనీ మీరే చెప్పండి" అంది ఇందిర సన్నని స్వరంతో.

"రాయటంలేదు"

"ఎందుకని..?"

"రాయబుద్ధి కావటంలేదు."

"ఎందుకని?"

"ఎందుకనంటే ఏం చెప్పేది? నాలోంచి ఏమీ ఇన్సిపిరేషన్  రావటంలేదు. నిస్సారంగా, స్తబ్ధుగా, మత్తుగా వుంది మనసు. అదీగాక –"

ఆడపిల్లలిద్దరూ చెప్పమన్నట్లు చూశారు.

"నాలో ఏమీ టాలెంట్ లేదు. నేను ఎందుకు రాశానో ఇప్పుడు స్పష్టంగా చెప్పలేకుండా ఉన్నాను. ఈ రాయటం ఎందుకు? ఏమిటి ఈ తపనంతా అనిపిస్తోంది. చివరకు విరక్తే మిగులుతోంది."

"ఈ చిన్న వయస్సులో మీకెందుకండీ విరక్తి?" అనడిగింది రత్నకుమారి.

అతను మందహాసం చేసి ఊరుకున్నాడు, జవాబు చెప్పలేదు.

ఇందిరకు కొంచెం ఉక్రోషం వచ్చింది. "చెప్పమను రత్నా, నవ్వకుండా. ఎందుకేమిటి విరక్తి?" అనంది.

"చెప్పలేను జవాబును. నాకూ సరిగ్గా తెలీదు. చాలా పుస్తకాలు రాసిన మీదట ప్రతివాడికీ ఈ దశ తప్పదేమో? ఇప్పుడు నాలో తృష్ణ చల్లారిపోయింది. రచనలు విరివిగా చెయ్యాలనుకున్నాను. చేశాను. నా వయస్సులో ఎవరూ సాధించనిది సాధించాలనుకున్నాను. సాధించాను. పేరు కావాలనుకున్నాను. నా తృప్తిమేరకు వచ్చింది. నన్నారాధించే వ్యక్తులుండాలనుకున్నాను. అదీ జరిగింది. ఒక జీవితం ఐపోయినట్లుగా వుంది. ఏ పొగరూ, ఉద్రేకం లేవు. అంతా నీరసం, శూన్యం. నిశ్చింత మట్టుకు లేదు. ఉండదేమోకూడా. జీవితంలో సెటిల్ కాకముందే ఓ రకమైన అనుభూతి పూర్తిగా పొందేశాను. నేను మామూలుగా మిగిలిపోయాను. నన్నెవరైనా కదిలించనిదే, కవ్వించనిదే కేవలం డాక్టరుగానే, రోగాలకు మందులిచ్చుకుంటూ గడపాల్సి వస్తుంది."

ఇందిర గగుర్పాటు చెందింది. అతని ముఖం కేసి దీర్ఘంగా చూసింది ఎంత అమాయకంగా, పసిగా నిష్కల్మషంగా వుంది. ఎందుకో ఆమె నేత్రాంచలాలలో నీళ్ళు నిలిచాయి.

"ఇంత గొప్ప రచయిత మీరు. ఇలా అంటారేం? ఎంత తపనగా ఉంది నాకు. అబ్బ ఎంత బాధగా వుంది" అని వాపోయింది లోలోపల అతన్ని చూస్తూ.

## 27

ఇందిర మధుబాబుని తరచు కలుసుకుంటోంది. ఇప్పుడు సిగ్గూ, సంకోచం చాలావరకు తీరిపోయాయి. కాని అతన్ని తమ ఇంటికి ఆహ్వానించే ధైర్యంలేదు ఆమెకు. ఓ పరపురుషుడితో మాట్లాడేటంతటి స్వేచ్ఛ ఆమెకు లేదు ఇంట్లో. మొదట్లో రత్నకుమారీ, ఆమె కలిసి వచ్చేవారు. తరువాత రత్నకుమారి అప్పుడప్పుడూ వస్తూండేది. ఇందిర వంటరిగానే రావటం నేర్చుకుంది.

మధుబాబు జీవితంలో ఏదో చిత్రం వుంది. అతని గిరిలోకి వచ్చేవాళ్ళు అతి త్వరలో ఎంతో సన్నిహితంగానైనా ఐపోతారు. లేక పట్టించుకోకుండా దూరంగానైనా జరిగిపోతారు. కాని మధ్యస్తంగా, కేవలం పరిచితులుగా ఎప్పుడూ మిగిలిపోరు.

ఇందిర తోటి స్నేహం అతనికి ముదావహముగానే ఉంది. ఆమె దగ్గర ఉన్నంతసేపూ అతను విశ్రాంతి ఫీలౌతున్నాడు. నిశ్చింతగా హాయిగా వుండేది.

కాని ఇందిర ఇంకా లోకంలోకి సరిగ్గా అడుగుపెట్టని యువతి. అన్నలూ, చెల్లెళ్ళూ, తల్లీ, తండ్రీ యీ బాధ్యతలు, బంధాలు తప్ప అన్యం ఆలోచించటానికి ఇంకా అలవాటు పడని అమ్మాయి. మధుబాబు పుస్తకాలు చదివాక జీవితాన్ని గురించి కొంచెం ఆలోచించసాగింది. మొదట అతను చాలా పెద్దవాడనీ, కనీసం నలభై ఏళ్ళయినా వుంటాయనీ చాలా ప్రాంతాలు తిరిగి అనుభవం, విజ్ఞానం సంపాదించిన వ్యక్తి అనీ అనుకుంది. కాని ఓసారి అతని ఫోటో చూశాక "ఇంత చిన్నవాడా?" అని విస్మయం చెంది, అతని రచనల్ని మరింత అభిమానిస్తూ వచ్చింది. ఇంతలో ఆమె తండ్రికి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పట్నుంచీ అతన్ని కలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతూనే వుంది. కాని తనంతట తను పోయి ఓ యువకుడ్ని ఎలా కలుసుకుంటుంది? ఆమె సిగ్గుపడింది. రత్నకుమారి చొరవ వలన చివరకు అతన్ని కలుసుకుంది.

ఇందిరకు ఇదివరకెన్నడూ మనశ్శాంతి లేకపోవటంలేదు. జీవితంలో కష్టాలూ, ఇబ్బందీ వుంటాయని తెలీదు. మధుబాబుతో సన్నిహితంగా వస్తున్నాక, అతని మాటలు వింటున్నాక ఆమెకి కూడా జీవితమంటే భయం వెయ్యసాగింది. ఓ రకం అశాంతి వేధించసాగింది. ఇదివరకులేని సమస్యలు ఇప్పుడు ఉత్పన్నమౌతున్నాయి.

"ఏమిటిలా వున్నారు?" అనడిగాడు ఒకరోజు మధుబాబు.

"ఎలా ఉన్నాను?" అని ఆమె ఎదురు ప్రశ్న వేసింది.

"దిగులుగా, అన్యమనస్కంగా కనిపిస్తున్నారు."

"లేదే" అని ఆమె తప్పించుకో చూచింది.

"చెప్పండి పర్వాలేదు. నాకు చేతనైతే సముదాయిస్తాను. నేను ఇతరుల్ని వోదార్చటానికే పుట్టాను తెలుసా?"

"నేను మాత్రం ఇతరులచేత వోదార్చబడటానికి పుట్టలేదండీ" అని సమాధానం చెప్పింది ఇందిర.

మధుబాబుకి చిన్న దెబ్బ తగిలింది. అతనామె ముఖం చూడలేకపోయాడు.

"కోపం వచ్చిందా?" అనడిగింది ఇందిర.

"కొంచెం" అన్నాడతను బలవంతాన నవ్వి.

"ఐతే శిక్ష విధించండి"

"ఏం శిక్ష?"

"మీ ఇష్టం. పది గుంజిళ్ళు."

అతని మనసంతా కెలికినట్లుంది. అక్కడ్నుంచి లేచి కిటికీ దగ్గరకు వెళ్ళి బయటకు చూడసాగాడు. పద్మజ జ్ఞాపకం వచ్చింది.

"ఏమయినా బాధ కలిగించానా?" అనడిగింది ఇందిర వెనకనుంచి భయంగా.

అతను ఆమెకేసి తిరిగి "అబ్బే లేదండీ. బాధ. మీరు నాకు ఎందుకు కలిగిస్తారు?" అన్నాడు గాద్గదికంగా.

"మీకంటే చిన్నదాన్ని నన్ను "మీరు", అనవచ్చా?"

"నేనట్లాగే అనగలనండీ. నువ్వూ అంటే ఎలాగో వుంటుంది."

"ఇహ ఎప్పుడూ ఇంతేనా?"

"భవిష్యత్‌ని గురించి నేను జోస్యం చెప్పలేను."

తమ ఇద్దరిమధ్యా సంభాషణ ఇలాగే అంతరంగికంగా వుండటం గమనించాడు మధుబాబు. తనలోని రచయితని చూసి ఆమె తన దగ్గరకు వచ్చినా చివరకు జనరల్ టాపిక్స్ లేకుండా పోయాయి ఇద్దరి మధ్యా. మాట్లాడలేకుండా వున్నారు. ఆ పుస్తకం రాయటంలో ఉద్దేశం ఏమిటనీ, యీ పుస్తకం రాయటంలో ఉద్దేశం ఏమిటని మొదట్లో అడుగుండేది.

చెప్పాలంటే అతనికి భావోద్రేకం కలిగేదికాదు. మెల్లిగా విషయం తప్పించేవాడు.

"పెళ్ళిని గురించి మీ ఉద్దేశం ఏమిటి?" అనడిగింది ఒకరోజు.

"నాకు దాని గురించి ఉద్దేశం నశించిపోయింది. అట్టే ఇష్టమూ లేదు."

ఇందిర ఆశ్చర్యంగా చూసింది.

"మరి మీ ఉద్దేశం?"

ఇందిర సిగ్గు పడింది."అబ్బ నాకు తెలీదు."

మధుబాబు బలవంతం చేస్తూ "ఫర్వాలేదు చెప్పండి. చెప్పాల్సిందే మరి" అన్నాడు.

ఇందిర కనులు మూసుకుని "పెళ్ళి ఓ మధుర బంధం" అంది ఎఱ్రబడ్డ ముఖంతో.

అతనట్లాగే చూస్తున్నాడు.

"మనిషికి నిండుతనం, సుఖం ప్రసాదించే ఆనందదాయకమయిన ఘట్టం, వరప్రసాదం."

ఆ తర్వాత చాలాసేపటిదాకా కనులు తెరవనేలేదు.

28

ఇందిరకూ, తనకూ మధ్య తెలియనిది ఏమయినా జరుగుతోందా? అన్న సంశయం మధుబాబుని వేధించసాగిందిం. మనుషులు ప్రేమ అంటారుగాని "ఒకర్ని ప్రేమించాను" అన్న స్థిరమైన సత్యం స్పష్టంగా తెలుసుకోవటం చాలా కష్టం. ఎప్పటికప్పుడు అర్ధంకాకుండా, ఆందోళనగా అందని అపూర్వంలా ఉంటుంది, పొరపాటునన్నా ఆ వ్యక్తిని గురించి భ్రమేమో అన్న శంక రాకుండా, తియ్యదనానికి, నిరంతరాలోచనకూ అంతరాయం లేకుండా ఉన్న స్థితే నిజమైన ప్రేమ.

ఒకర్ని ప్రేమించినా, ప్రేమించకపోయినా ఏ స్త్రీ అయినా ఒక పురుషుడి సాన్నిహిత్యంలో తరుచు వున్నదంటే ఆమె తప్పకుండా అతడిని కలవరపరుస్తుంది. మా ఇద్దరి మధ్యా ఏంలేదు, "వొట్టి స్నేహం" అని ధైర్యంగా చెప్పుకోవటం బుకాయింపు. తరువాతది స్నేహంగానే మిగిలిపోవచ్చు. సోదర సోదరీ ప్రేమ క్రింద పరిణమించవచ్చు. చంచలతను తప్పించుకోవటం మాత్రం దుస్సాధ్యం. ఓ స్త్రీ అంటే బొత్తిగా గౌరవం లేక, లేకపోతే అసహ్యం ఉండి ఆమెతో ఎన్ని గంటలు, రోజులు గడిపినా వికారం కలగలేదంటే అది వేరే విషయం. కారణాలు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి.

ఓసారి ఇందిరకు జ్వరం వచ్చింది. రత్నకుమారిద్వారా ఈ విషయం మధుబాబుకు తెలిసింది. వెళ్ళి చూడాలని ఆరాటపడ్డాడు. కాని వాళ్ళ ఇంటికి ఎలా వెళతాడు? ఊరుకున్నాడు.

కొన్నాళ్ళు పోయాక ఇందిర చిక్కిపోయి, కళాకాంతులు నశించిన ముఖంతో మధుబాబు దగ్గరకు వచ్చి "నాకు చచ్చిపోవాలని ఉందండీ" అంది.

"అదేమిటి?" అన్నాడతను విస్మితుడై.

"ఎందుకూ, యీ ఆరోగ్యం లేని బ్రతుకు? అసహ్యంగా వుంది. నాకు బతకాలనిలేదు... బ్రతకాలని లేదు" అని ఇందిర కన్నీళ్ళు కార్చింది.

తాను కాస్త నలుపని మరో దిగులు ఆమెకు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments